

# 2. సహధర్మచారిణి

శైలజ దగ్గర నా శీలాన్ని ఎలా నిరూపించుకోవాలో నాకు అస్సలు అర్థం కావడం లేదు. ఒకరు కాదు... యిద్దరు కాదు... ఏ అమ్మాయి మీద పడితే ఆ అమ్మాయి మీదే నేను మోజుపడుతున్నానంటుంది.

బైక్ మీద వెళ్తూ ఉంటామా! సడన్‌గా ఒక అమ్మాయి కనబడుతుంది, బ్రైట్‌గా ఉన్న డ్రెస్‌లో.

అప్రయత్నంగా నా తల అటువైపు తిరుగుతుంది, ఒక్కక్షణమే. అది చాలు తనకి. మోటర్‌సైకిల్ ఆ అమ్మాయిని దాటగానే "బాగుందా!" అంటుంది.

"ఎవరు!" అంటాను నేను బింకంగా.

"ఇప్పుడు చూసిన అమ్మాయి."

ఎప్పుడూ అనుకుంటాను నేను "బాగుంది" అనో "బాగాలేదు" అనో నిజాయితీగా సమాధానం చెప్దామని. కనీసం "నీ అంత బాగాలేదు" అన్న అందమైన జవాబు అయినా యిద్దామని.

కానీ అదేం ఖర్మమో శైలజ ఎపుడు ఆ ప్రశ్న అడిగినా....నా నాలుక టకీమని "ఏ అమ్మాయి! నేనెవర్నీ చూళ్ళేదు" అంటుంది.

శైలజ ఆ అబద్ధాన్ని చచ్చినా నమ్మదు. ఎలా నమ్ముతుంది! నా తల తొంభై డిగ్రీల కోణంలో రెండుసార్లు అటూ ఇటూ తిరగడాన్ని అప్పటికే స్పష్టంగా చూసి ఉంటుంది కదా!

ఇక ఓ అరగంట చర్చ జరుగుతుంది. చివరికి నేను ఓడిపోయి, చేతులెత్తేసి "ఏమైందిపుడు చూస్తే! ఏదో క్యూరియాసిటీ. అంతే కదా!" అంటాను.

"అంతేలెండి. నేను మాత్రమేమన్నానిపుడు! మీకు కాస్త క్యూరియాసిటీ ఎక్కువ అన్నాను అంతేగా!" అంటుంది.

నోరు మూసుకోవడం మినహా చేసేదేం లేదు. సరే. అంతవరకూ అయితే ఫర్లేదు. అలాంటి సంఘటనలలో పోనీ కాస్తో కూస్తో నా తప్పు కూడా ఉందనుకోవచ్చు. కానీ కొన్ని కొన్ని అభాండాలు నా తప్పు అసలేమీ లేకుండా కూడా నా నెత్తిన పడుతూ ఉంటాయి.

మా వీధి చివర మెయిన్‌రోడ్ మీదకి ఓ ఇస్త్రీ బట్టల దుకాణం వుంది. ఒక లావుపాటి ఆవిడ కూర్చుంటుంది ఆ బంకులో. మొదట్లో కొన్నాళ్ళు మా బట్టలు అక్కడే ఇచ్చేవాళ్ళం. కానీ ఆమె అస్సలు బాగా చేయకపోవడం వల్లా... పైపెచ్చు రోజుల తరబడి బట్టలన్నీ రోడ్డుమీద ఉంచి, ఆ దుమ్మంతా పట్టించి...ఇంకాస్త మురికిగా మారుస్తూండటం వల్లా....ఇక ఆ అమ్మాయికి బట్టలు ఇవ్వకూడదని తీర్మానించింది శైలజ.

మెయిన్‌రోడ్ మీద కాకుండా ఇటు ప్రక్కన సందులోకి ఉన్న షాపులో ఇమ్మంటుంది.

ఈ షాపు ఓ నాలుగడుగులు లోపలికి ఉంటుంది. బైక్ మీదే అనుకోండి... అయినా ఆ కాస్త దూరం వెళ్ళడానికి నాకు బద్ధకం.

ఈ ఒక్కసారికి....ఈ ఒక్కసారికి.... అనుకుంటూ ప్రతిసారీ ఆ అమ్మాయికే ఇస్తూండటం...బట్టలు ఇంటికి రాగానే...విషయం గ్రహించి శైలూ చిందులు తొక్కడం... "ఏం నచ్చింది ఆ అమ్మాయిలో మీకు!" అని విరుచుకుపడడం.

"ఇదిగో శైలూ...దారుణంగా మాట్లాడకు. ఆ అమ్మాయిలో ఏదో నచ్చడమేమిటి!" అని నేను కసురుకుంటానా!

"ఏదోనే నచ్చాలి మరి! ఈ మురికి పట్టిన బట్టలు నచ్చే అవకాశం లేదు కదా! అయినా ఆ అమ్మాయికే ఇస్తున్నారంటే... ఇంకేదోనే నచ్చుండాలి మరి!" అంటుంది.

నాకు చిర్రెత్తుకొస్తుంది. "ఛీ. ఛీ. ఇంకెపుడూ ఆ అమ్మాయికి ఇవ్వకూడదు" అనిపిస్తుంది. కానీ మళ్ళీ వారం అదే పనిచేయడం...అదే సీన్ రిపీట్ అవడం...శైలూతో అవే మాటలు మళ్ళీ మళ్ళీ పడడం.

అసలు ఈ ఒక్క విషయం అని కాదు. శైలూ నిష్ఠూరాలాడాలంటే ఇంకో అమ్మాయి సీన్‌లో ఉండాల్సిన అవసరం కూడా లేదు.

ఏదన్నా మాటా మాటా అనుకుని ఆ విసుగులో "పో. అవతలికి" అంటానా! "నాకు తెలుసులెండి. నన్ను తరిమేసి ఎవతినో తెచ్చుకుందామనుకుంటున్నారు. మీ ఆటలు నేనేం సాగనివ్వను" అంటుంది.

నాకు నవ్వాలో ఏడవాలో అర్థం కాదు.

శైలజకి నేను ఎంతో స్వేచ్ఛ యిస్తాను. ఏ పని అయినా తన ఇష్టప్రకారమే చేసుకునే అవకాశం ఇస్తాను.

తన ఉద్యోగం... వ్యాపకాలు... దేంట్లోనూ నేను తలదూర్చను. తన టైమ్ అంతా నాకే కేటాయించాలని గానీ... నా పనులే చేయాలని గానీ ఆంక్షలు పెట్టను.

శైలజ బాగా చదువుకుంది. మంచి ఉద్యోగం చేస్తోంది. చాలా విషయాలలో ప్రతిభా... చక్కగా విశ్లేషించగల వివేకం... అనర్గళంగా మాట్లాడగల చాతుర్యం ఉన్నాయి.

మరి ఈ ఒక్క విషయంలో ఇంత మూర్ఖంగా ఎందుకు ప్రవర్తిస్తుందో అర్థం కాదు.

పొద్దున కూడా ఇలాగే అర్థంపర్థం లేని చెత్త వాగుతూంటే...నేను విసురుగా లేచి ఆఫీస్‌కి వచ్చేశాను. తను నాకోసం సిద్ధం చేసి ఉంచిన లంచ్‌బాక్స్ తీసుకోకుండా... నా కోపం అంతా అర్థమయ్యేట్లుగా తలుపుని గట్టిగా లాగి వచ్చేశాను.

ఇపుడు పరిస్థితి ఎలా ఉందో!

ఇంట్లోకి అడుగుపెట్టి, కామ్‌గా షూస్ విప్పుకుని బెడ్‌రూమ్‌లోకి నడిచాను. డ్రెస్ మార్చుకుని వచ్చి హాల్లో కూర్చుంటుంటే శైలూ అంతే నిశ్శబ్దంగా కాఫీ తెచ్చిచ్చింది.

"మధ్యాహ్నం అన్నం తిన్నారా!" అంది.

"ఆఁ" అన్నాను ముక్తసరిగా.

"ఎక్కడ! క్యాంటీన్‌లోనా!" అంది.

నేను మాట్లాడలేదు. పొద్దున అన్ని మాటలు అని ఇపుడు ఏమీ జరగనట్లు మాట్లాడుతున్న శైలూని చూస్తే ఆశ్చర్యమూ, కోపమూ రెండూ వచ్చాయి.

"శుభలేఖ వచ్చింది" అంటూ కార్డు తెచ్చి చేతిలో పెట్టింది.

పూర్ణ వాళ్ళ గృహప్రవేశం. ముందుగా తెలిసిన కబురే. పదిరోజుల క్రితమే పూర్ణ ఫోన్ చేసి "అన్నయ్యా! తప్పకుండా రావాలి" అని చెప్పింది.

"ప్రయాణం ఉందా లేదా!" అంది శైలూ.

"చూస్తాను" అన్నాను.

శైలూ విసురుగా వంటగదిలోకి వెళ్ళిపోయింది. నాకు అర్థమయింది. మళ్ళీ కోపమొచ్చింది తనకి.

ఎల్లుండి తెల్లవారుఝామున గృహప్రవేశం. కాబట్టి రేపు రాత్రికే అక్కడ ఉండాలి. అంటే ఈ రాత్రికో...రేపు ప్రొద్దున్నేనో బయల్దేరాలి.

అంత దగ్గర్లోని ప్రయాణాన్ని గురించి వెళ్తాననో, వెళ్ళననో స్పష్టంగా చెప్పకుండా 'చూస్తాను' అన్నానని శైలూకి కోపం.

కానీ నా పద్ధతి అంతే. ఆఖరి నిమిషం వరకూ నేనేదీ కచ్చితంగా అనుకోను. అది శైలూకెందుకు అర్థంకాదు!

నేను ఆ విషయం వివరించబోయినా 'ఎందుకు అనుకోరు! మీరు ఏదో ఒకటి నిర్ణయించుకునే ఉంటారు. నాకు చెప్పడమే ఇష్టం లేదు' అంటుందని నాకు తెలుసు.

అందుకే నేనేం మాట్లాడలేదు.

రెండుగంటల తర్వాత బయల్దేరి బ్యాగ్‌లో ఓ జత బట్టలు పెట్టుకుని వచ్చి ట్రైన్ ఎక్కాను.

తెల్లవారేటప్పటికి పూర్ణావాళ్ళింట్లో ఉంటాను. పూర్ణ నాకన్నా రెండేళ్ళు చిన్నది. మహేశ్ దాన్ని పెళ్ళి చేసుకునేటపుడే ఉద్యోగం మానేసేయాలని చెప్పాడు. పూర్ణ ఒప్పుకుంది.

అత్తగారూ, మామగారూ పూర్ణ దగ్గరే ఉంటారు. వాళ్ళ పనులూ, మహేశ్ పనులూ ఇదే లోకం దానికి.

గేట్ తీసుకుని లోపలికి అడుగుపెడుతూండగానే పూర్ణ గబగబా ఎదురొచ్చి "వదినేదీ!" అంది.

"బాబుకి పరీక్షలు కదా!" అన్నాను నేను.

"ఏరా వచ్చావా!" అంటూ అమ్మా... ఆ వెనుకే అన్నయ్యా..వదినా..పిల్లలూ నన్ను చుట్టుముట్టారు.

నామొహంవైపు ఒకసారి పరీక్షగా చూసి బ్యాగ్ అందుకుని లోపలికి నడిచింది పూర్ణ.

స్నానం చేసి, పూర్ణ పెట్టిన ఇడ్లీలు తిని న్యూస్‌పేపర్ పట్టుకుని కూర్చున్నాను.

ఇల్లంతా సందడిగా వుంది. "నా షేవింగ్ సెట్ ఏదీ! వేణ్ణీళ్ళు పెట్టావా! లుంగీ ఏదీ! దువ్వెనిస్తావా!" అంటూ అన్నయ్య ఒకదాని తర్వాత ఒకటి అడగడం, వదిన అందించడం వినబడుతోంది.

అన్నయ్యని చూస్తే ఇదే చిరాకు నాకు. ప్రతిపనికీ వదినని సతాయిస్తాడు.

అన్నయ్య అనే కాదు. చాలామంది మగవాళ్ళు అంతే. ఇక్కడ ఫంక్షన్‌లో కూడా అటు మహేశ్ బావగార్లూ.. అన్నదమ్ములూ అందరూ అన్నీ ఆడవాళ్ళనే అడగడం... వాళ్ళని ఒక్కక్షణం కూడా తీరుబడిగా ఉండనివ్వకపోవడం గమనిస్తున్నాను నేను.

నేను శైలజనెపుడూ ఇలా అడగను. నా పన్లన్నీ నేనే చేసుకుంటాను. ఇలా చిన్నపిల్లల్లా ప్రతిదానికీ భార్యమీద ఆధారపడేవాళ్ళని చూస్తే నాకు చాలా చిరాకు కూడా.

మహేశ్ కుటుంబం గురించి నాకసలెపుడూ సదభిప్రాయం లేదు. పూర్ణని ఉద్యోగం మానేసి ఇరవైనాలుగు గంటలూ ఇంట్లో చాకిరీ చేయాలని స్పష్టంగా చెప్పినవాళ్ళు కదా!

ఆలోచనతోనూ, అసహనంతోనూ ముడుచుకున్న నా నొసలు "హలో! ఎప్పు డొచ్చారు!" అంటూ వచ్చి నా ప్రక్కనే కూర్చున్న మహేశ్‌ని చూడగానే మామూలుగా అయ్యాయి.

ప్రొద్దున లేస్తూనే గృహప్రవేశం చేయాల్సిన ఇంటిదగ్గర పనులేవో చూడటానికి వెళ్ళాడట.

నాతో ఒక నిమిషం మాట్లాడి స్నానానికి వెళ్ళాడు మహేశ్. ఆ తర్వాత అంత హడావుడిలోనూ పూజ చేసుకున్నాడు. అప్పుడు పూర్ణ పెట్టిన ఫలహారం తిని మళ్ళీ ఎక్కడికో వెళ్ళాడు. మధ్యాహ్నం భోజనాలప్పుడు కాసేపు కనిపించాడంతే. మళ్ళీ రాత్రి భోజనాలదాకా ఏవో పనులమీద తిరుగుతూనే ఉన్నాడు.

రాత్రిపూట భోజనం అయ్యాక నేను వరండాలో వాల్చిన మంచంమీద కూర్చుంటే అందరికీ వక్కపొడి అందించి...చివరగా నా దగ్గరికి వచ్చాడు. నేనో పలుకు నోట్లో వేసుకోగానే డబ్బాకి మూతపెట్టి ప్రక్కనపెట్టి తనుకూడా నా ప్రక్కనే కూర్చున్నాడు.

"ప్రొద్దున్నుంచీ ఒక్కక్షణం కూర్చోకుండా తిరుగుతున్నారే! మీరు కూడా పని చేస్తారని నాకీరోజే తెలిసింది" అన్నాను నేను.

మహేశ్ నవ్వుతుంటే....పూర్ణ వచ్చి వరండాలో మెట్లమీద కూర్చుంటూ "ఏంట్రోయ్ బావగారి మీద జోకులేస్తున్నావ్!" అంది.

"జోకులు కాదే. మెచ్చుకుంటున్నాను. నీమీద పెత్తనం చేయడం కాకుండా బావగారు వేరేపనులు కూడా చేస్తారని నాకు తెలీదు" అన్నాను.

"పెత్తనం గురించి నువ్వు మాట్లాడుతున్నావా! వదిన్ని ఇంట్లో వదిలేసి వచ్చావుగానీ!" అంది పూర్ణ.

"నేను వదిలేయడమేమిటి! బాబుకి పరీక్షలని తనే రాలేదు" అన్నాను.

"బాబుకి పరీక్షలు కాబట్టి నేను రాలేనని నీతో చెప్పిందా!"

"నాతో చెప్పడమెందుకు! ఆ రోజు నీతోనే చెప్పిందిగా!"

"ఏ రోజు!"

"నువు ఫోన్ చేసిన రోజు. 'సరిగ్గా అదే టైమ్‌కి బాబుకి పరీక్షలు' అంది కదా!"

పూర్ణ నావైపు సూటిగా చూసింది. "అంటే ఆ తర్వాత నువు మళ్ళీ వదినని అడగలేదన్నమాట."

"లేదు" అన్నాను. పూర్ణ ఎందుకన్ని ప్రశ్నలేస్తోందో అర్థం కాలేదు నాకు.

"ఎలాంటి మనిషివన్నయ్యా నిజంగా నువ్వు!" అంది పూర్ణ చిరాకుపడుతూ. "నేను ముందే అనుకున్నాను. నువు వదిననసలు సరిగ్గా అడగకుండా నీపాటికి నువు బయల్దేరి వచ్చి ఉంటావని. ఆ రోజు నేను గృహప్రవేశం గురించి చెప్పగానే వదినేదో మామూలుగా బాబుకి పరీక్షలు అంది. 'యూనిట్‌టెస్టులేగా, రాయకపోయినా పర్లేదులే.' అన్నాను నేను. 'అవున్లే' అంది తను."

పూర్ణ మాటలు విని నేను ఆశ్చర్యపోయాను. నేను ఏదో చెప్పబోతూంటే పూర్ణ లేచి నిలబడింది. "పెళ్ళాంతో సరిగా మాట్లాడటమన్నా రాదు కానీ పెత్తనాల గురించి చెప్తున్నాడు. ఎంత బాధగా ఉందో నాకు చిన్నవదిన రాకపోతే"... రుద్ధమయిన గొంతుతో నన్ను కసురుకుని విసురుగా లోపలికి వెళ్ళిపోయింది పూర్ణ.

"వాళ్ళు కూడా వస్తే బాగుండేది." అన్నాడు మహేశ్. "సరే. కాసేపు పడుకోండి. బయల్దేరాల్సిన టైమ్‌కి లేపుతాను." అంటూ లోపలికి వెళ్ళాడు.

మంచంమీద వాలానుగానీ నిద్రపట్టలేదు నాకు. నిన్న సాయంత్రం శైలూ సోఫాప్రక్కన నిల్చుని 'ఏంటి ప్రయాణం వుందా! లేదా!' అని అడగడమే కళ్ళముందు మెదుల్తోంది.

శైలూ కూడా వద్దామనుకుందా! అయ్యో! నిజంగా చాలా బాధగా అనిపించింది నాకు. కానీ నాకెలా తెలుస్తుంది! బాబుకి పరీక్షలంటే సాధారణంగా శైలూ ఎక్కడికీ వెళ్ళదు. వీలైతే ఆఫీసుకు సెలవు కూడా పెడుతుంది. అదే అనుకున్నాను కానీ.... తను వస్తే తీసుకురావడానికి నాకేం అభ్యంతరం!

తెల్లవారుఝామున గృహప్రవేశం... ఆ తర్వాత సత్యనారాయణ వ్రతం. బయటి సందడితో సంబంధం లేకుండా నా మనసులో ఆలోచనలు..

ఆ ఆలోచనలని భగ్నం చేస్తూ మధ్య మధ్య వాళ్ళ మాటలూ వినబడుతున్నాయి.

పూర్ణ ఆడపడుచులిద్దరూ పూర్ణ అత్తగారి దగ్గర కూర్చుని వ్రతం చూస్తున్నారు.

"ఇదేం చీరమ్మా! చాలా బాగుంది." తల్లి చీరని పరీక్షిస్తూ అడిగింది మహేశ్ వాళ్ళ అక్కయ్య.

"ఏమోనమ్మా. నాకు తెలీదు. పూర్ణ తెచ్చింది." అంది ఆవిడ.

"బాగుంది. ఈ రంగు నీకు చాలా బాగా సూట్ అయింది."

కూతురి ప్రశంస విని పూర్ణ అత్తగారు నవ్వింది. "రంగు ఏమో కానీ చాలా తేలిగ్గా హాయిగా ఉంది. బరువు చీరెలు కట్టలేకపోతున్నాను. పూర్ణ చక్కగా నాకు హాయిగా ఉండేవి ఏరి తెస్తుంది."

"వదిన చేసిన పనికి ఇంక వంకేం ఉంటుంది!" అంది మహేశ్ చెల్లెలు. "ఇంట్లోకి రాకముందే ఎంత చక్కటి తోట పెంచిందో చూడు."

పూర్ణ అత్తగారు నవ్వుతూ చెప్పింది "అవును. ఇల్లు మొదలు పెట్టినపుడే మొక్కలు కూడా నాటింది. కనకాంబరం, మందార, గన్నేరు, చామంతి, నిత్యమల్లె... అన్నయ్య పూజకి బోలెడు పూలు. అన్నయ్య కూడా రోజూ వచ్చి నీళ్ళు పోసేవాడు. ఇద్దరూ కలిసి మంచితోట తయారుచేశారు."

నాకు ఆనందంగా అనిపించింది వాళ్ళు పూర్ణని మెచ్చుకుంటుంటే. వాళ్ళు ఎప్పుడూ తనని అలాగే మెచ్చుకుంటారు. 'పొగిడి పనిచేయించుకోవడం... అదోరకం తెలివి' అనుకుని చిరాకు పడేవాడిని నేను.

కానీ ఇపుడు పూర్ణ పరోక్షంలో కూడా మెచ్చుకుంటున్నారంటే... అందులో నిజాయితీ ఉందేమోననిపించింది.

'బాగున్నారా!' అంటూ నా ప్రక్కనే వచ్చి కూర్చున్న వ్యక్తిని చూసి ఆలోచనలలోనుంచి తేరుకున్నాను. మహేశ్ పిన్నికొడుకు. బెంగుళూర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు.

నవ్వుతూ తలవూపి "సెటిలయ్యారా బెంగుళూర్‌లో" అన్నాను.

అతనికి ఈ మధ్యే పెళ్ళయ్యింది. భార్య ఇంకా కాపురానికి రాలేదు.

"ఇల్లు తీసుకున్నాను. కానీ ప్రస్తుతానికి ఫ్రెండ్‌రూమ్‌లోనే ఉంటున్నాను." అన్నాడతను.

"ఏం!" అన్నాను.

"ఫర్నీచర్ ఏం లేదు కదా క్రొత్త ఇంట్లో. మంచాలు, టి.వి. ఏం లేవు. భోజనానికి కూడా ఇబ్బంది కదా!" అన్నాడు.

"మీకు వంట రాదా!" అన్నాను నేను గొంతులో హేళన ధ్వనించకుండా జాగ్రత్తపడుతూ.

పెళ్ళాం లేకపోతే భోజనానికి యిబ్బంది అనే మగవాళ్ళని చూస్తే నాకు నవ్వొస్తుంది. వంట అనేది పెద్ద బ్రహ్మవిద్యలా భార్యలమీద ఆధారపడిపోవడం.

నేనయితే శైలూ ఆఫీసునుంచి రావడం లేటయితే తనొచ్చేసరికి వంట చేసేస్తాను. తను ఉన్నపుడు కూడా నాకిష్టమయినవి ఏమయినా కావాలంటే తనని అడక్కుండా నేనే చేసేసుకుంటాను.

నా మనసులో మళ్ళీ బాధ సుడులు తిరిగింది. నేను ఇంత బాగా ఉన్నా కూడా శైలూకి నామీదా, నా ప్రేమ మీదా నమ్మకం లేకపోవడం ముల్లులా మనసుని గుచ్చింది.

"వంట రాక కాదండీ. సామానంతా ఇపుడే కొనకు. తను వచ్చాక ఇద్దరూ కలిసి వెళ్ళి కొనుక్కోండి. తనకి కూడా నచ్చాలి కదా! అంది పూర్ణ వదిన. అందుకే ఏమీ కొనలేదు. ఇల్లు మాత్రం మళ్ళీ దొరకదని తీసేసుకున్నాను. అద్దె ఇల్లే కదా! నచ్చకపోతే మార్చచ్చు."

అతని మాటలు నన్ను ఆశ్చర్యపరిచాయి. పూర్ణ మాటలకి ఎంత విలువ ఇస్తారు వీళ్ళందరూ! అనుకున్నాను.

నాకు మా పెళ్ళప్పటి రోజులు గుర్తొచ్చాయి. పెళ్ళయ్యేసరికి నాకో డొక్కు స్కూటర్ ఉండేది. సెకండ్ హ్యాండ్‌లో కొన్నది. శైలూతో కలిసి ఎక్కడికి బయల్దేరినా అది మధ్యలో ఆగిపోతూ ఉండేది.

ఇక లాభం లేదని క్రొత్త బైక్ తీసుకున్నాను. ఆఫీస్‌లో ఫ్రెండ్స్ స్వీట్స్ అడిగితే... ఒక ప్యాకెట్‌కొని అందరికీ పంచి... మిగిలినవి ఇంటికి తీసుకువెళ్ళాను. ప్యాకెట్ చేతిలో పెడుతుంటే... 'ఎందుకు!' అంది శైలూ.

"కొత్త బైక్ తెచ్చుకున్నాను" అన్నాను నేను గదిలోకి నడుస్తూ.

బైక్ అనేకాదు. ఇంట్లో ముఖ్యమైన సామానంతా శైలజ వచ్చేసరికే కొనేశాను. "నువ్వు చిన్న స్పూన్‌కూడా తీసుకురానవసరం లేదు మీ ఇంటినుంచి" అని మొదటి రాత్రి శైలూతో గర్వంగా చెప్పాను కూడా.

పదిపదిహేనుమంది పిల్లలు బిలబిలమంటూ రావడంతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మహేశ్ స్టూడెంట్స్‌ట వాళ్ళందరూ.

మహేశ్ వాళ్ళకి ఇల్లు చూపిస్తూంటే... నేనూ వాళ్ళతో కలిసి లోపలికి నడిచాను.

మహేశ్ లైబ్రరీగది చూసి మురిసిపోయారు వాళ్ళు.

"సర్ నా రిసెర్చ్‌వర్క్ అయ్యేవరకూ ఇక్కడే ఉండిపోతాను సర్" అన్నాడు వాళ్ళలో ఒకతను.

"నిరభ్యంతరంగా ఉండు" అన్నాడు మహేశ్ నవ్వుతూ. "ఇదిగో ఈ ప్రక్కన గెస్ట్‌రూమ్ కూడా ఉంది..."

మహేశ్ మాట పూర్తి కాకముందే అందరూ సంతోషంతో 'ఓ' అని అరిచారు.

మధ్యాహ్నమంతా అదే సందడి.

సాయంత్రానికి ఇంట్లో వాళ్ళం మాత్రం మిగిలాం. అలసిపోయిన శరీరాలతో తోటలోని కుర్చీలలో కూలబడ్డాం.

"ఈ హడావుడి అయ్యాక ఒక నాలుగు రోజులు మా దగ్గరికి రా."

అమ్మ ఆహ్వానం విని "ఆఁ ఇక్కడ ఇబ్బంది కాదూ!" అంది పూర్ణ.

"ఇబ్బందేం ఉంది! భార్య చేత చాకిరీ చేయించుకునే మగవాళ్ళకి భార్య రెండ్రోజులు లేకపోతేనే ఆమె విలువ తెలిసొస్తుంది," అన్నాను నేను.

"ఏం బావగారూ!" అంటే మహేశ్ నవ్వి ఊరుకున్నాడు. పూర్ణ మాత్రం "మాటమాట్లాడితే చాకిరీ చాకిరీ అంటావేమిట్రా! నీకు చాకిరీకి, సహకారానికీ తేడా తెలీదు. భర్తకి సహకారం అందించడానికి ఏ భార్యా బాధపడదు. సంతోషపడుతుంది" అంది.

"ఆ మాట నువ్వే చెప్పాలి." అన్నాను నేను. "నిజానికి అమ్మాయిలెవరూ పెళ్ళికాగానే ఇన్ని బాధ్యతలు నెత్తినేసుకోవాలనుకోరు. పెళ్ళికి ముందు ఎలా ఉన్నారో పెళ్ళయ్యాక కూడా అలాగే ఉండాలనుకుంటారు." ఆడపిల్లల మనస్తత్వాన్ని కాచి వడబోసిన అనుభవజ్ఞుడిలా దర్పంగా చెప్పాను.

"పెళ్ళికి ముందులాగే ఉండేటట్లయితే ఇక పెళ్ళి చేసుకోవడమెందుకూ...!" అంది అప్పుడే వచ్చిన వదిన తన భారీకాయాన్ని కుర్చీలో కుదేస్తూ.

వదిన అమాయకంగా దీర్ఘం తీసిన తీరుకి అందరూ ఒక్కసారి ఫక్కున నవ్వారు. అరక్షణం తర్వాత ఆ వాక్యంలోని లోతైన భావమేదో పట్టుకున్నట్లు మళ్ళీ ఒక్కసారి కలిసికట్టుగా మందహాసం చేశారు.

నాకు మనసంతా ఏదోగా అయిపోయింది. వాళ్ళందరూ ఒక్కటై మూర్ఖంగా నన్ను అపహసిస్తున్నారనిపించింది. ఇది నేను కూర్చుని మాట్లాడదగిన సభ కాదనిపించింది. విసురుగా లేచి ఇవతలికి వచ్చేశాను.

మెట్ల దగ్గరికి నడిచి రెయిలింగ్‌కి ఆనుకుని నిలబడ్డాను. పూర్ణ లేచి నా దగ్గరికి వచ్చింది. "అదేంటన్నయ్యా అలా వచ్చేశావు! కోపం వచ్చిందా!" అంది.

నేను మాట్లాడకపోవడంతో నాచేతిమీద చేయివేసి "ఏంటన్నయ్యా!" అంది.

నాకెందుకో దుఃఖం వచ్చింది. నేనేదో చాలా ఆదర్శవంతంగా ఉంటున్నానన్న నా భావానికీ... అహంభావానికీ దెబ్బ తగలడంవల్లో..ఏ ఇబ్బందీ కలిగించకుండా ఎంతో బాగా చూసుకుంటున్నా, శైలూ నా మీద వేస్తున్న అభాండాలు గుర్తు రావడంవల్లో... ఎందుకో తెలీదు ... దుఃఖం వచ్చింది.

దాన్ని అదిమిపెట్టి గాంభీర్యాన్ని తెచ్చుకుని... "మీ ఆడవాళ్ళసలు ఎపుడూ అర్థం కారులే" అన్నాను నిష్ఠూరంగా.

ఒక రకమైన ఆవేశంతో నేను శైలజని ఎంత బాగా చూసుకుంటున్నానో... ఎంత స్వేచ్ఛనీ, ప్రైవసీని ఇస్తున్నానో... అయినా తను నామీద ఎలాంటి అపనిందలు వేసి బాధపెడ్తుందో గడగడా చెప్పాను.

నా ఆవేదన అంతా పూర్ణ స్థాణువులా నిలబడి వింది.

నా దగ్గరగా వచ్చి నా చేయి పట్టుకుని లాగి మెట్లమీద కూర్చోపెట్టి తనూ నా ప్రక్కనే కూర్చుంది.

రెండు క్షణాలు మౌనంగా గడిచాయి. నేనే తేరుకుని... "మొన్నకూడా తను ఇలా అడ్డగోలుగా మాట్లాడటం వల్లే నా మూడ్ పాడయింది. లేకపోతే 'నువ్వూ వస్తావా!' అని అడిగి ఉండే వాడినేమో!" అన్నాను సంజాయిషీ ఇస్తున్న ధోరణిలో.. తప్పునాది కాదన్న భావాన్ని కలగలుపుతూ.

పూర్ణ మోకాళ్ళమీద తల ఆనించుకుని నావైపు చూసింది. వెన్నెల్లో మెరుస్తూన్న దాని మొహమూ... అందులోని సానుభూతి నాకు సాంత్వన కలిగిస్తుంటే మెల్లగా అన్నాను.

"అదికాదే పూర్ణా. ఆత్మవంచన లేకుండా చెప్పు. ఈ చాకిరీతో నువు బాధపడడం లేదూ! ఎంతోమంది అమ్మాయిలు పెళ్ళయ్యాక ఉండే చాకిరీకి భయపడి అసలు పెళ్ళే వద్దనుకుంటున్నారు తెలుసా ఈ రోజుల్లో!"

"పెళ్ళి వద్దనుకునే అమ్మాయిల సంగతి నాకు తెలీదన్నయ్యా. పెళ్ళి చేసుకున్న అమ్మాయిలు ఏం ఆశిస్తారో చెప్పమంటే చెప్పగలను" అంది పూర్ణ.

"ఏం ఆశిస్తారు! భర్త తమ కష్టం సుఖం అర్థం చేసుకోవాలని ఆశిస్తారు. తమ మీద పెత్తనం చేయకూడదని ఆశిస్తారు" అన్నాను.

"అవును. దానితోపాటు భర్త తన సహకారాన్ని అందుకోవాలని కూడా ఆశిస్తారు" అంది పూర్ణ.

"నీలాంటివాళ్ళు" అన్నాను నేను వ్యంగ్యంగా.

"నేనే కాదన్నయ్యా. వదిన కూడా అదే ఆశిస్తుంది" అంది పూర్ణ స్పష్టంగా.

నేనేదో అనబోతూంటే నన్ను మాట్లాడవద్దన్నట్లుగా చేయి అడ్డం పెట్టింది పూర్ణ.

"నేను చెప్పేది విను అన్నయ్యా. నీ ఆలోచనలని నేను తప్పుపట్టడం లేదు. కానీ ఒక్క విషయం అర్థం చేసుకో... భార్యాభర్తల మధ్య ముఖ్యంగా ఉండాల్సింది సహకారం. అందుకోసమే పెళ్ళి. అలా సహకరించుకునే ఉద్దేశ్యమే లేకపోతే పెళ్ళి అవసరమే లేదు. ఒకర్నొకరు అర్థం చేసుకోకుండా... బలవంతంగా దౌర్జన్యంగా సహకారాన్ని పొందడమూ... అయిష్టంతో, అసహాయతతో సహకరించడమూ లోపాలయితే వాటిని సరిదిద్దుకోవాలి. కానీ ఆ లోపాలను పూడ్చడం కోసం అసలు సహకారాన్నే వద్దనుకోవడం... ఇంకా పెద్ద లోపం."

పూర్ణ చిన్నగా నిట్టూర్చి మళ్ళీ చెప్పింది.

"భార్యాభర్తలుగా మీరిద్దరూ ఒకరితో ఒకరు సహకరించుకుంటున్న విషయాలే కనబడట్లేదన్నయ్యా నాకు. తన పనులన్నీ వదిన చేసుకుంటుంది. నీ పనులన్నీ నువ్వు చేసుకుంటావు. బహుశా బాబు పనుల్లో ఏమన్నా కొంచెం సహకారం అందించుకుంటున్నారేమో. కానీ నాకర్థమయినంతవరకూ అదికూడా సహకారం అన్న భావంతో కలిసి చేసుకోవడం కాకుండా... కొన్ని పనులు నీవీ, కొన్ని పనులు నావీ అన్న ధోరణిలో ఉన్నారు." ఆ మాట అంటూ పూర్ణ లేచి నిలబడింది.

"భార్యాభర్తలు ఒకరికొకరు సహకరించుకునే పనులు తగ్గించుకోవడం కాదన్నయ్యా. కల్పించుకోవాలి. నీ పనులన్నీ తనచేత చేయించకపోవడం తనని సుఖపెట్టడమయితే

కావచ్చు. కానీ ఇద్దరూ కలిసి కొన్ని పనులు చేయడం సాహచర్యం. మొదటిదానివల్ల ప్రేమ కలుగుతుందో లేదో నాకు తెలీదు కానీ రెండో దానివల్ల బంధం బలపడుతుంది.”

మెట్లు దిగుతూ నా భుజం మీద తట్టింది పూర్ణ. “పద. భోజనాల సంగతి చూడాలి. మళ్ళీ నువ్వు బయల్దేరాలి కదా!”

తను వడివడిగా లోపలికి వెళ్ళిపోయింది. కానీ నేను వెంటనే కదల్లేకపోయాను.

కాసేపటి తర్వాత పూర్ణ భోజనం పెట్టి, నాకోసం శైలజ కోసం కొన్న బట్టలు పెట్టింది.

అవన్నీ బ్యాగ్‌లో సర్దుకుంటూ ప్రక్కనే నిలుచున్న పూర్ణని “భార్యాభర్తలు సహకరించుకునే పనులంటే ఏమిటే!” అన్నాను.

పూర్ణ నవ్వింది. “ఏంటంటే ఏం చెప్పను అన్నయ్యా! సరిగ్గా ఆలోచిస్తే నీకే తెలుస్తుంది. పెద్దన్నయ్య ఉండడం వల్ల సగం పనులు నీదాకా రానేరావు. నాన్న తద్దినానికి కూడా నీకిష్టమయితే వస్తావు. లేకపోతే అన్నయ్యొక్కడే పెట్టేస్తాడు. మిగతా సగం పనులూ నువు వేస్ట్ అనో బోర్ అనో తీర్మానించి మానేశావు. ఇక ఒక గృహస్థుగా నువు చేసే పనులేమున్నాయి! అందులో వదిన సహకరించడానికి ఏం మిగిలాయి?”

అదలా ఎక్కడ్నుంచి ఎక్కడికో ముడిపెడుతుంటే నాకు ఒళ్ళుమండింది. “ఏం పనులు చేయడం లేదే నేను!” అన్నాను ఉక్రోషంగా. “ఇక్కడ అందరూ నిన్ను నీ అంతవాళ్ళు లేరని పొగుడుతుంటే... ఇక మిగతా వాళ్ళందరూ చవటల్లా కనిపిస్తున్నారు నీకు.” అన్నాను.

నా మాటలకి పూర్ణ నవ్వింది. “ఊరికే ఎందుకు పొగుడుతారన్నయ్యా నన్ను! మీ బావగారి సంగతి నీకు తెలీదు. నేను చేసిన పని బాగుంటేనే మెచ్చుకుంటారు” అంది.

“బాగాలేకపోతే!”

“బాగాలేకపోతే పర్లేదులే అని సర్దుకుంటారు. అత్తయ్యగారు, మామయ్యగారు కూడా అంతే. బాగుంటే మెచ్చుకుంటారు. లోపాలుంటే సర్దుకుంటారు.”

“మరింక నీ గొప్పదనమేముంది అందులో!” అన్నాను నేను హేళనగా.

“నిజమే అన్నయ్యా.” అంది పూర్ణ వెంటనే ఒప్పుకుంటూ. “నా గొప్పతనం ఏమీ లేదు. ఇది వాళ్ళ గొప్పతనమే. ఇంకో విషయం చెప్పనా నీకు! పనుల విషయానికి వస్తే శైలూ వదిన నాకంటే సమర్థురాలు. మీ బావగారు నీకంటే సమర్థులు. అయినా వదినలాగా అభద్రతా భావం నాలో కలగడం లేదంటే అది వాళ్ళ గొప్పదనమే.”

ఒక షాక్‌లా తగిలాయి నాకామాటలు. మరింకేం మాట్లాడలేని వాడిలా చూసి బ్యాగ్ తీసుకుని బయటికి నడిచాను.

నా వెనకే వస్తూ "ఎప్పుడైనా మనధర్మం మనం సరిగ్గా నిర్వర్తిస్తే ఏ కన్ఫ్యూజనూ ఉండదన్నయ్యా. అది వదిలిపెట్టి ఎన్ని ఆలోచనలు చేసినా... ఆదర్శాలు చెప్పినా చివరికి అయోమయమే మిగుల్తుంది" అంది పూర్ణ.

అది అంతకు ముందు చెప్పిన విషయానికీ, ఈ మాటలకీ సంబంధం ఏమిటో నాకర్థం కాలేదు.

శైలూ నా శీలాన్ని నమ్మడం లేదన్న నా సమస్యకు 'నువ్వు ధర్మాచరణ చేయాలి' అని పరిష్కారం చెప్తుందేమిటి పూర్ణ!

నేను అర్థం కానట్లు చూస్తూ... "అంటే ఏమిటి? శీలమూ, ధర్మమూ ఒకటేనంటావా!" అన్నాను.

పూర్ణ నవ్వింది. 'నువు వేరనుకుంటున్నావా!' అంది.

బ్యాగ్‌తో పాటు ఆ ప్రశ్ననీ మోసుకుంటూ వచ్చి బస్ ఎక్కాను నేను.

ప్రశ్నలు, ...... ఆలోచనలు, మధ్య మధ్య నిద్ర.... మళ్ళీ ప్రశ్నలు... ప్రయాణమంతా ఇలాగే సాగింది.

మధ్యాహ్నం మహేశ్ చుట్టాలాయన ఎవరో అన్నాడు. "ఇల్లు బాగుందయ్యా. నీ లైబ్రరీ... పూజగదీ... గెస్ట్‌రూం.... మీ అమ్మానాన్నల గదీ... ఇంటిముందరి తోట... అన్నీ ఒక్కోటి ఒక్కో యజ్ఞశాలలా ఉన్నాయి" అని.

గృహస్థు అంటే పంచయజ్ఞాలు చేయాలట. ఆయన వివరంగా చెప్పాడు కానీ నేను సగమే వినిపించుకున్నాను. బస్‌లో కూర్చుని ఆలోచిస్తుంటే ఆయన మాటలు కొంచెం అర్థమయినట్లుగా అనిపించాయి.

తెల్లవారేసరికి ఇంట్లో అడుగుపెట్టాను. శైలూ మౌనంగా కాఫీ ఇచ్చింది. డైనింగ్ టేబుల్ దగ్గర నిలుచుని పంచదార డబ్బాలోకి వంచుతోంది.

నేను కాఫీ సిప్ చేస్తూ టీపాయ్‌మీది పాంప్లెట్ చేతిలోకి తీసుకున్నాను.

శివాలయంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా సత్యనారాయణ వ్రతం చేయిస్తారట. దాని వివరాలు.

"మనం కూడా చేసుకుందామా!" అన్నాను.

శైలూ అర్థం కానట్లు చూసింది.

పాంఫ్లెట్ చూపిస్తూ "వ్రతం" అన్నాను.

ఆశ్చర్యం కోపాన్ని జయించగా "ఎందుకు!" అంది శైలూ.

"ఊరికే. నిన్న పూర్ణావాళ్ళు చేసుకుంటుంటే నాకు కూడా చేసుకోవాలనిపించింది... నీతో కలిసి."

ఆఖరి మాట వింటూనే శైలూ కళ్ళల్లోకి ఓ మెరుపు దూసుకువచ్చింది.

స్పష్టంగా అర్థమవుతున్న ఉద్వేగాన్ని కంట్రోల్ చేసుకుంటూ సగం వంచిన పంచదార కవర్‌ని జాగ్రత్తగా టేబుల్‌మీద నిలబెట్టి నా దగ్గరికి వచ్చింది శైలూ.

నా ఒడిలో కూర్చుని ధీమాగా నా గుండెలపై తల ఆనించింది.

తనని చుట్టేసిన నా రెండు చేతుల్లోని పాంఫ్లెట్‌వైపు మా ఇద్దరి కళ్ళూ చిరునవ్వుతో చూశాయి. అందులోని వివరాలవైపు ఆసక్తిగా పరుగుతీశాయి.

**- సాహితీ స్రవంతి-సాహిత్య పత్రిక**

*జూలై-సెప్టెంబర్, 2010*